Dr. K.V.P.RAMACHANDRA RAO
EX- MEMBER OF PARLIAMENT
(RAJYA SABHA)

सत्यमेव जयते

Block-B, 1st Floor,
Stemwood Apartments,
14, Factory Road,
Near Safdarjung Hospital,
New Delhi - 110029.

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి,

తేదీ : 04.10.2024

ప్రస్తుత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు, గౌరవనీయులు శ్రీ మల్లిఖార్జున్ ఖర్గే గారు కర్ణాటక గుల్బర్గా ప్రాంతంలో పార్టీ ప్రముఖ నాయకుడిగా ఉండగా..దాదాపు 1970 లో విద్యార్థి దశలో కాంగ్రెస్ పార్టీతో నా ప్రస్థానం ప్రారంభం అయ్యింది. 1976 లో గౌహతిలో జాతీయ యూత్ కాంగ్రెస్ సమావేశాలలో పాల్గొనడం, తరువాత 1977 పార్లమెంట్ ఎన్నికలలోను, 1978 శాసనసభ ఎన్నికలలో పార్టీలో కీలకంగా పనిచేయడం, 1983 లో భారతదేశ ఉక్కుమహిళ శ్రీమతి ఇందిరాగాంధీ గారి హయాంలో 33 ఏళ్ళ వయసులో.. గాంధీభవన్ ఇంచార్జిగా పనిచేయడం, 2004 లో వైయస్ నాయకత్వంలో కాంగ్రెస్ ను రాష్ట్రంలో మళ్ళీ అధికారానికి తేవడంలోనూ, 2009 లో అధికారం చేజారకుండా కాపాడడంతో పాటు కేంద్రంలో రెండోసారి UPA2 ప్రభుత్వం ఏర్పడడానికి రాష్ట్రం నుంచి 34 (33+1) మంది పార్లమెంట్ సభ్యులు ఎన్నిక కావడంలోనూ కీలక పాత్ర వహించి, 12 సంవత్సరాలు రాజ్యసభ సభ్యుడిగా పార్టీకి సేవలందించి, 1984 నుండి ఇప్పటివరకూ ఏఐసీసీ సభ్యుడిగా ఉంటూ, దాదాపు 5 దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో నిబద్ధత కలిగిన కార్యకర్తగా కొనసాగుతున్న నేను.. "నేను కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొనే ప్రతి కార్యక్రమాన్ని/ పథకాన్ని త్రికరణశుద్ధిగా సమర్థిస్తాను, చిత్తశుద్ధితో అమలుచేయడానికి నా శాయశక్తులా కృషి చేస్తాను" అని ..ఈ రోజు ఒక కాంగ్రెస్ ముఖ్యమంత్రికి చెప్పవలసి రావడం బాధాకరమే అయినా.. తప్పడం లేదు.

మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు కాంగ్రెస్ పార్టీకి అత్యంత ఇష్టమైన ప్రాజెక్టు. 2004 లో డా. వై యస్ రాజశేఖరరెడ్డి గారి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే వైయస్ మూసీ నది ప్రక్షాళన కార్యక్రమం పై ప్రత్యేక దృష్టి నిలిపిన విషయం నాకు బాగా గుర్తు. ప్రపంచ ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ హఫీజ్ కాంట్రాక్టర్ గారిని పిలిపించి, మూసీ ప్రక్షాళనకు ఒక మార్గం సూచించమని ఆయన అప్పట్లోనే కోరారు. అప్పటి ప్రభుత్వంలో కీలకంగా ఉన్న నేను కూడా ఆ సమావేశాలలో పాల్గొన్నాను.

24 ఆగష్టు 2005 న "సేవ్ మూసీ" పేరుతో రూ.908 కోట్ల అంచనాలతో ఒక పథకం కూడా వైయస్ చేతులమీదుగా ప్రారంభం అయినది. అయితే, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రైతులకు సబ్సిడీలు, వ్యవసాయ రుణమాఫీ, రైతు ఆత్మహత్యల నివారణ, పేదలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా పేరుతో ఉచిత వైద్య సేవలు, 108 / 104 సేవలు, పేదలకు పెద్దయెత్తున ఇందిరమ్మ ఇళ్ళు, పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల వరకు అందరికీ .. పూర్తి ఫీజు రీయంబర్స్ మెంట్ పథకం.. వంటి సంక్షేమ కార్యక్రమాలు, కోటి ఎకరాల సాగు కోసం భారీఎత్తున చేపట్టిన జలయజ్ఞంలో.. ప్రాణహిత-చేవెళ్ళ, కల్వకుర్తి ఎత్తిపోతల, నెట్టెంపాడు, ఎస్ఎల్బిసి వంటి ప్రాజెక్టులు, విద్యుత్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధికోసం భారీ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్ట్ లు, హైదరాబాద్ దశ-దిశ మార్చిన ఔటర్ రింగ్ రోడ్, మెట్రో రైల్, అంతర్జాతీయ విమానాశ్రయం, హైదరాబాద్ భవిష్యత్ అవసరాలకోసం మంచినీటి సరఫరా ప్రాజెక్టులు.. వంటివి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యాలుగా ఉండడం వల్ల.. రాష్ట్రంలో ఆర్థిక వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని, దొరికిన మేరకు రుణాలు తెచ్చి భావితరాలను అప్పులపాలు చేయకూడదని నిర్ణయించుకోవడం జరిగింది.

Contd..2

H.No.8-2-544/101, Sri Durga Palm Springs, Road No.7, Banjara Hills, Hyderabad -500034, Telangana State

Dr. K.V.P.RAMACHANDRA RAO
EX- MEMBER OF PARLIAMENT
(RAJYA SABHA)

सत्यमेव जयते

Block-B, 1st Floor,
Stemwood Apartments,
14, Factory Road,
Near Safdarjung Hospital,
New Delhi - 110029.



మూసీ ప్రక్షాళన వల్ల నష్ట పోయే ప్రతి పేద/మధ్య తరగతి వారికి సంతృప్తికరమైన పునరావాసం కల్పించి, మూసీకి పూర్వస్థితి కల్పించాలంటే.. అధిక మొత్తంలో నిధులు అవసరం అని గ్రహించి.. ఆ పథకాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించలేక పోయింది. అయితే తరువాతి టర్మ్ లో ఈ పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని వైయస్ గట్టిగా భావించినా.. వైయస్ మరణంతో వీలు కాలేదు.

ఇక 2020 జనవరిలో నేను రాజ్యసభ సభ్యుడిగా ఉండగా, పార్టీ ఆదేశాల మేరకు నేరేడుచెర్ల పురపాలక సంఘం లో వోటర్ గా నమోదు చేసుకున్నాను. అప్పుడు పురపాలక సంఘ అధ్యక్షుడి ఎన్నిక సందర్భంగా అప్పటి పిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారితో కలిసి రెండు సార్లు నేరేడుచెర్ల వెళ్లిరావడం జరిగింది. అప్పట్లో కలుషితం అయిన మూసీ జలాల గురించి, దీనివలన ఆ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి, మూసీ ప్రక్షాళన అవసరం గురించి కూలంకషంగా తెలుసుకున్న నేను, వైయస్ హయాంలోనే ఈ మూసి ప్రక్షాళన చేపట్టలేకపోయినందుకు చాలా బాధ కూడా పడ్డాను.

కాబట్టి, మీ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు చేపట్టిన మూసీ ప్రక్షాళన/ సుందరీకరణను నేను పూర్తిగా స్వాగతిస్తున్నాను. మద్దతు ఇస్తున్నాను. నిజానికి మన పార్టీ శ్రేయోభిలాషులు కొంతమంది ప్రభుత్వం మూసి ప్రక్షాళనను మొదటిదశలోనూ,సుందరీకరణను రెండవ దశలోనూ చేపడితే బాగుంటుందని మీకు సూచించవలసినదిగా నన్ను కోరినా.. మూసీ సుందరీకరణపై మీ ఆసక్తిని గమనించి, మీ ఆలోచన, విజన్, సమర్ధత పై నమ్మకంతో.. ఆ విషయం మీదృష్టికి తేలేదు. పేదలకు నష్టం కలుగకుండా మన ప్రభుత్వం చేపట్టే అన్ని అభివృద్ధి పనులకు ఒక క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తగా నేను స్వాగతిస్తాను.

ఇక ఈ ప్రాజెక్ట్ విషయంలో అటు BRS నాయకులు గానీ, ఇటు BJP నాయకులు గానీ, వారి పెంపుడు మీడియా గానీ, పేదలకు అన్యాయం పేరుతో మాట్లాడేవి, చేస్తున్నవి.. అన్నీ వారి స్వప్రయోజనాలు కాపాడుకోవడం కోసమే. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలు, పేదల అభివృద్ధి, సంక్షేమమే.. కాంగ్రెస్ పార్టీ మౌలిక సిద్ధాంతమని.. ఈ విషయంలో ప్రతిపక్షాలది మొసలికన్నీరే నని..దేశప్రజలందిరికి తెలుసు. ఈ విషయంలో మీ ఆశయాన్ని దెబ్బతీయడానికి వారి ప్రయత్నాలను కూడా నేను ఖండిస్తున్నాను.

ఇక అజీజ్ నగర్ లో నా కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న ఫార్మ్ హౌస్ మీద, వారి స్వార్ధం కోసం, ప్రతిపక్ష నాయకులు పదేపదే ఆరోపణలు చేస్తూ.. మీ భుజంపై తుపాకీ పెట్టి నన్ను కాల్చాలని, తద్వారా మిమ్మల్ని ఇరుకున పెట్టాలని ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా మీపై, మన పార్టీపై, ఆధారాలు లేని ఆరోపణలు చేయడానికి, ప్రతిపక్షాలు నన్ను, నా కుటుంబ సభ్యుల పేరుపై ఉన్న ఫార్మ్ హౌస్ ను పావుగా వాడుకోవడం, క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తగా నాకు తీవ్ర మనోవేదన కలిగిస్తున్నది.

Contd..3

H.No.8-2-544/101, Sri Durga Palm Springs, Road No.7, Banjara Hills, Hyderabad -500034, Telangana State

Dr. K.V.P.RAMACHANDRA RAO
EX- MEMBER OF PARLIAMENT
(RAJYA SABHA)

सत्यमेव जयते

Block-B, 1st Floor,
Stemwood Apartments,
14, Factory Road,
Near Safdarjung Hospital,
New Delhi - 110029.



నా కుటుంబ సభ్యులు చెప్పిన ప్రకారం, ఆ ఫార్మ్ హౌస్ లో ఏ కట్టడమూ, ఎఫ్‌టిఎల్ పరిధిలో గానీ, బఫర్ జోన్ పరిధిలో గానీ లేవు.. బిఆర్ఎస్ వారు నాపై ఆరోపణలు చేసిన 20 ఆగస్ట్ ననే ఒక టివి చానెల్ ఇంటర్వ్యూ లో ఈ విషయం నేను చెప్పాను. ఆ ఫార్మ్ హౌస్ లో ఏ కట్టడమైనా ఒక్క అంగుళం మేరకు ఎఫ్‌టిఎల్ , బఫర్ జోన్ పరిధిలో ఉన్నా, నా కుటుంబసభ్యులు తమ స్వంత ఖర్చులతో కూల్చడానికి సిద్ధంగా ఉన్నారని కూడా ఆ రోజే స్పష్టం చేసాను. నా కుటుంబ సభ్యులు ఇప్పటికీ ఆ మాటకే కట్టుబడి ఉన్నారు.

**సంబంధిత అధికారులను వీలు చేసుకొని, వెంటనే మా ఫార్మ్ హౌస్ కు పంపించండి. వారు చట్ట ప్రకారం అక్కడ ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ల పరిధిని మార్క్ చేస్తే, ఆ పరిధిలో ఏదైనా కట్టడం మా ఫార్మ్ హౌస్ లో ఉంటే, 48 గంటలలో ప్రభుత్వానికి భారం కాకుండా, మా స్వంత ఖర్చులతో ఆ కట్టడాన్నికూల్చి, ఆ వ్యర్థాలను తొలగించి, శుభ్రం కూడా చేస్తామని మా కుటుంబ సభ్యుల తరుపున మీకు హామీ ఇస్తున్నాను. అయితే ఈ మార్కింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని నా కోరిక. ఆ మార్కింగ్ చేసే సమయం, తేదీ ముందే ప్రకటిస్తే, నాపై పదేపదే ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులు, వారి అనుకూల మీడియావారు కూడా తీరిక చేసుకొని వచ్చి, ఈ ప్రక్రియని వీక్షించే అవకాశం కలుగుతుంది. పారదర్శకత కోసం ఇది నా సూచన మాత్రమే.**

ఇక 1980 నుండి హైదరాబాద్ లో స్థిరనివాసం ఏర్పరుచుకొని, అప్పటినుండి వచ్చిన ప్రతి శాసనసభ, లోక్ సభ, స్థానిక సంస్థల ఎన్నికలలోనూ ఒక ఓటర్ గా పాల్గొంటూ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు, నా మిత్రుల, శ్రేయోభిలాషుల సహకారంతో వనరులు సమకూర్చి, వారి గెలుపు కృషి చేస్తూ, ఒక క్రమశిక్షణ, నిబద్దత కల్గిన కాంగ్రెస్ కార్యకర్తగా, ప్రాంతాలకు అతీతంగా, జాతీయ పార్టీ కాంగ్రెస్ బలోపేతానికి నా శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నాను. చేస్తూనే ఉంటాను. నా వల్ల పార్టీ కి నష్టం కలిగే ఏ పని చేయను. చేయలేను. ఇది నేను, డా. వైయస్ రాజశేఖర రెడ్డి దాదాపు మూడు దశాబ్దాల క్రితం అంటే 1996 లో, మా అంతరాత్మ సాక్షిగా తీసుకున్న నిర్ణయం. నా తుది ఊపిరి వరకూ దీనికి కట్టుబడే ఉంటాను.

కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా నాకు చట్టం నుంచి ఏ మినహాయింపులు వద్దు. ఒక సాధారణ పౌరుడి విషయంలో చట్టం ఏ విధంగా వ్యవహరిస్తుందో అదే విధంగా వ్యవహరిస్తే చాలు. ఎక్కువ-తక్కువలు అవసరం లేదు. మీరు, నేను కలుగచేసుకోకుండా, చట్టాన్ని తన పని తాను చేసుకోని పోనిద్దాం.

మీ నాయకత్వంలో ఉన్న మన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎటువంటి చెడ్డపేరు తేవడానికి నాలో నరనరాన ఉన్న కాంగ్రెస్ రక్తం అంగీకరించనందుననే మీకు ఈ బహిరంగ లేఖ.

అభినందనలతో

భవదీయుడు

కె.వి.పి.రామచంద్ర రావు.

(డా.కె.వి.పి. రామచంద్ర రావు)

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు,

గౌరవ ముఖ్యమంత్రి, తెలంగాణ.

H.No.8-2-544/101, Sri Durga Palm Springs, Road No.7, Banjara Hills, Hyderabad -500034, Telangana State